క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఏఈ మాలతి

చిత్తూరు రూరల్: ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మండల హౌసింగ్ ఏఈ మాలతి అన్నారు. మండలంలో పెరుమాళ్ల కండ్రిగ జగనన్న లేవుట్‌లో సాగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను ఆమె బుధవారం పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడుతూ, ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసుకోవాలన్నారు. బిల్లులు కూడా సకాలంలో పడుతున్నాయని చెప్పారు. నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది సతీష్, శరత్ తదితరులు ఉన్నారు.

లోకోస్ యాప్‌పై అవగాహన



లోకోస్ యాప్‌పై శిక్షణ ఇస్తున్న ఏపీఎం రవి

తవణంపల్లె: లోకోస్ యాప్ ద్వారా సంఘమిత్రలకు అవగాహన ఉండాలని వైఎస్సార్ క్రాంతి పథకం ఏపీఎం రవి తెలిపారు. మండల కేంద్రంలోని వైఎస్సార్‌కేపీ భవనంలో బుధవారం సంఘ మిత్రలకు లోకోస్ యాప్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం రవి మాట్లాడుతూ లోకోస్ యాప్ ద్వారా స్వయం సహాయక సంఘాల ఆర్థిక లావాదేవీలతో పాటు సభ్యుల వివరాలను సమగ్రంగా నమోదు చేయించాలని చెప్పారు. అన్ని సంఘాల వివరాలను సులభతరంగా తెలుసుకోవడానికి ఈ యాప్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సీసీలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులకు శిక్షణ



హెచ్‌ఎంలకు శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్లు

బంగారుపాళెం: మండల కేంద్రంలోని పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం మండలంలోని ప్రధానోపాధ్యాయులకు స్కూల్ పెర్ఫార్మెన్స్ ఎవాల్యూషన్ టూల్‌పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రధానోపాధ్యాయులు సోషల్ ఆడిట్ ఏ విధంగా చేయాలన్న అంశాలపై జిల్లా రిసోర్సు పర్సన్లు గిరిబాబు, శశికుమార్ అవగాహన కల్పించారు. శిక్షణ పొందిన హెచ్‌ఎంలు పాఠశాల స్థాయిలో పేరెంట్స్ కమిటీ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగేశ్వర్‌రావు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

వైభవంగా అగ్నిగుండ ప్రవేశం



అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

పూతలపట్టు: మండలంలోని యం.బండపల్లిలో మహాభారత మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఈ నెల 14 వతేదీ నుంచి రోజుకో నాటక ప్రదర్శనతో, భక్తుల నడుమ అంగరంగ వైభవంగా జరిగాయి. చివరి రోజైన బుధవారం సాయంత్రం భక్తులు అమ్మవారిని దర్శించుకొని భక్తి శ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పక్కాగా సర్వేరాళ్లు నాటాలి



సర్వే రాళ్లు నాటుతున్న అధికారులు

యాదమరి: సర్వే రాళ్లను పక్కాగా నాటాలని తహసీల్దార్ చిట్టిబాబు రెవెన్యూ అధికారులను కోరారు. ఆయన మండలంలోని కొటాల పంచాయతీ గ్రామాల్లో బుధవారం రీ సర్వే పూర్తయిన భూముల్లో రాష్ట్ర ప్రభుత్వం అందించిన సర్వే రాళ్లను రాటే కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం రెవెన్యూ అధికారులతో మాట్లాడుతూ రీ సర్వే పూర్తయిన ప్రతి సచివాలయ పరిధిలోని గ్రామాల్లో ప్రభుత్వం అందించిన సర్వే రాళ్లను రైతుల సమక్షంలో నాటాలన్నారు. వాటిని తొలగించకుండా చూసుకోవాలని రైతులకు సూచించాలని కోరారు. అధికారులు సైతం తప్పులు తడకగా నాటకుండా పక్కాగా నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

స్పందనతోనే పరిష్కారం



స్పందన సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్న మండల అధికారులు(ఫైల్)

స్పందన వేదిక: నమస్కారమండీ.. మేము 1902 కాల్ సెంటర్ నుంచి మాట్లాడుతున్నాం..
ఫిర్యాదుదారుడు: చెప్పండి సార్
వేదిక: మీరు భూమి సమస్య ఉందని స్పందనలో అర్జీ పెట్టుకున్నారా?
ఫిర్యాదుదారుడు: అవును సార్ పెట్టాం.
వేదిక : తరువాత అధికారులు మిమల్ని కలిశారా?
ఫిర్యాదుదారుడు: కలిశారు.. వెరిఫికేషన్ చేసుకుని వెళ్లారు. మూలపత్రాలు నకలు కాపీ తీసుకెళ్లారు.
వేదిక: ఎన్నిరోజుల్లో పరిష్కారమవుతుందని చెప్పారు?
ఫిర్యాదుదారుడు: రెండు రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.
వేదిక: దీనిపై మీరు సంతృప్తికరంగా ఉన్నారా?
ఫిర్యాదుదారుడు: గతంలో అర్జీలు ఇస్తే పట్టించుకునే వారు కారు. ఇప్పుడు ఇంటి వద్దకు వచ్చి పరిశీలిస్తున్నారు. పరిష్కరిస్తారనే నమ్మకం ఉంది. కానీ ఎప్పటికి పరిష్కారమవుతుందో వేచి చూడాలి సర్.

- క్షేత్రస్థాయిలో పరిశీలన తప్పనిసరి
- ప్రభుత్వ ఆదేశాలతో కదులుతున్న అధికారులు
- సంతృప్తి స్థాయిలో వినతుల పరిష్కారం
- కాల్ సెంటర్ నుంచి ఫిర్యాదుదారుడి అభిప్రాయ సేకరణ

చిత్తూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేసింది. స్పందన ద్వారా ఫిర్యాదు చేసే సమస్యలపై అధికారుల తక్షణం స్పందించేలా చర్యలు తీసుకుంటోంది. ఫిర్యాదుదారుడు సంతృప్తి చెందే వరకు వేదిక ద్వారా ప్రభుత్వం వెంటబడుతోంది. ఇచ్చే వినతి పక్కదారి పట్టకుండా పక్కాగా పరిష్కరించేలా పర్యవేక్షిస్తోంది. ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు క్షేత్రస్థాయికి పరుగులు తీయక తప్పడం లేదు. సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించేలా చూస్తున్నారు. ఆ తరువాత కూడా స్పందన వేదిక నుంచి ఫిర్యాదుదారుడి అభిప్రాయాన్ని సేకరిస్తున్నారు.

చిత్తూరు మండలంలో 17 పంచాయతీలు ఉండగా 117 గ్రామాలు ఉన్నాయి. 45 వేలకు పైగా జనాభా ఉంది. వీరు ఎక్కువగా రైతులు, దినసరి కూలీలే ఉన్నారు. మండలంలో ప్రధానంగా భూ ఆధారిత సమస్యలు వస్తున్నాయి. రేషన్‌కార్డు, ఇంటిస్థలాలు తదితర సమస్యలపై స్పందన ద్వారా అర్జీలు వస్తుంటాయి. ప్రతి వారం 15 నుంచి 20లోపు చిత్తూరు తహసీల్దార్ కార్యాలయానికి అర్జీలు ఇస్తుంటారు. ఇక్కడ పరిష్కారం కాని పక్షంలో ఆర్డీఓ, కలెక్టర్‌ను కలిసి ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమంలో విన్నవిస్తుంటారు. గత నాలుగు నెలల్లో 152 అర్జీలు వచ్చాయి. ఇందులో 110 వరకు పరిష్కరించగా, 41 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక 1902, 'జగనన్నకు చెబుదాం'కు ప్రతినెలా 20 నుంచి 30లోపు ఫిర్యాదులు వెళుతున్నాయి. కొంత మంది ఆన్‌లైన్ ద్వారా స్పందనకు ఇంటి నుంచే అర్జీ పెట్టుకుంటున్నారు.

అధికారులు కదులుతున్నారు

ప్రస్తుత ప్రభుత్వం ప్రతి సోమవారం కార్యాలయాల్లో స్పందనను నిర్వహించేలా చేసింది. ఆన్‌లైన్ ద్వారా ఆధార్ నంబరు, ఫోన్ నంబరు ఓటీపీ సాయంతో ఇంటినుంచే ఫిర్యాదు చేసేలా అవకాశం కల్పించింది. 1902 అనే టోల్ ఫ్రీ నంబరుతీసుకొచ్చి సమస్యల పరిష్కారానికి బాటలు వేసింది. ఈ మధ్య కాలంలో క్షేత్రస్థాయి సిబ్బంది ఈ వినతులపై నిర్లక్ష్యం వహిస్తున్నారని గుర్తించి, మార్పులు తీసుకొచ్చింది. 'జగనన్నకు చెబుదాం' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సంతృప్తి స్థాయిలో ప్రజా వినతుల పరిష్కారమే లక్ష్యంగా పెట్టుకుంది. దీని కోసం ట్రాకింగ్ సిస్టంను అవలంభిస్తోంది. అందిన అర్జీలపై ప్రతి వారం ఆడిట్, నివేదికలు, సమీక్షలు చేయిస్తోంది. కాల్‌సెంటర్ల నుంచి ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తోంది. ఫిర్యాదుదారుడితో మాట్లాడి పరిష్కారమయ్యేలా చూస్తున్నారు. అందులోని లోటుపాట్లను వివరిస్తూ, స్పందన వినతుల పరిష్కారం సంతృప్తినిచ్చేలా చేస్తున్నారు.

నిర్ణీత సమయంలో..



స్పందన అర్జీలపై ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతోంది. సిబ్బందిని అప్రమత్తం చేస్తూ, పరిష్కరించేలా చూస్తున్నాం. సమస్య ఉన్న చోట క్షేత్ర స్థాయిలో పరిశీలించి, చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి వారం సమావేశం నిర్వహించి, వీఆ ర్‌ఓ, మండల సిబ్బందికి సూచనలు, సలహాలు ఇస్తూ స్పందన అర్జీల పరిష్కారానికి కృషి చేస్తున్నాం.

-కిరణ్, తహసీల్దార్

వేగవంతంగా హౌసింగ్ పనులు

పూతలపట్టు: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన ఇళ్లను, వాటి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ గౌరి అన్నారు. మండలంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. వారితో మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 900 ఇళ్ల నిర్మాణాలు పూర్తయి లబ్ధిదారులు గృహప్రవేశం చేశారన్నారు. మిగిలిన 800 ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులతో మాట్లాడి పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో బాధ్యతగా పనిచేయాలని సూచించారు. నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. ప్రతి శాఖలోని సిబ్బంది పని తీరును పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ సుశీల, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చోరీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ఎస్‌ఐ వెంకటసుబ్బమ్మ

చిత్తూరు రూరల్: చోరీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బీఎన్‌ఆర్‌పేట ఎస్‌ఐ వెంకటసుబ్బమ్మ అన్నారు. మండలంలోని బీఎన్‌ఆర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడారు. వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న దొంగతనాల దృష్ట్యా మండల ప్రజలు జాగ్రత్త పడాలన్నారు. సెలవుల కారణంగా బయటి ఊర్లకు వెళ్లాల్సి వస్తే పోలీసులకు సమాచారం అందించవచ్చని చెప్పారు. దీంతో ఆ ఇంటిపై సిబ్బందితో నిఘా పెట్టిస్తామన్నారు. వేసవి తాపానికి వీధుల్లో, మిద్దెపై పడుకోవడం మంచిదికాదని, దొంగల బారినుంచి జాగ్రత్త పడాలని ఆమె పేర్కొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల విజయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న ఆర్.కే కళాశాల ప్రిన్సిపల్ రమేష్‌బాబు

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ఇంటర్ పరీక్షల ఫలితాల్లో పలువురు విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. మురుగానపల్లిలో ఉన్న శ్రీ వివేకానంద (పీఎస్‌ఎన్) కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కరస్పాండెంట్ సత్యనారాయణ, ప్రిన్సిపల్ నాగరాజశెట్టి తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో నేహిత్ 466/470, పవన్, రిత్విక్‌రాజ్ 465, చాందినీ 464 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో హర్షిత 990/1000, తేజస్వి, సాయితేజరెడ్డి 985, నితిన్ 984, చందన 983, బైపీసీలో గీతశ్రీ 983 మార్కులు సాధించి శభాష్ అనిపించుకున్నారు.

మిట్టూరు ఆర్‌కే జూనియర్ కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కరస్పాండెంట్ బద్రినారాయణ, ప్రిన్సిపల్ రమేష్‌బాబు తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో జోషిత 461, మానిక శ్రీ 460, ఎంఈసీలో చేతన, హేమంత్ 484, రామ్‌చరణ్‌రెడ్డి 476, తేజస్విని 475 మార్కులు సాధించారన్నారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో తనూజా రెడ్డి 989, లక్ష్మీప్రియ 980, మేఘన 977, మానస 976, సోఫియా 971, ఎంఈసీలో విష్ణు, పావ్య 981, ఉదయశ్రీ 978, హర్షిత 977, బైపీసీలో షేక్ అమ్రిన్ 952 మార్కులు సాధించినట్లు తెలిపారు.

ఆధార్ నమోదు వేగవంతం



సిబ్బందితో మాట్లాడుతున్న రవికుమార్

పూతలపట్టు: చిన్నపిల్లలకు ఆధార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని డీఎల్‌డీఓ రవికుమార్ అన్నారు. మండలంలోని పి.కొత్తకోట గ్రామ సచివాలయాన్ని బుధవారం పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. ఎస్‌డీజీ సర్వేను పూర్తిచేయాలని సూచించారు. మంజూరైన హౌసింగ్ నిర్మాణ పనుల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి జరీనాబేగం పాల్గొన్నారు.

శ్మశాన వాటికల ఏర్పాటుకు ప్రాధాన్యత

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీ రెడ్డెప్ప, కలెక్టర్ షణ్మోహన్



సమీక్షలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వం దళిత వాడల్లో శ్మశాన వాటికల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం జీడీ నెల్లూరు నియోజకవర్గం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ప్రభుత్వం దళిత వాడల్లో శ్మశాన వాటికల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యత ఇస్తూ చరిత్రాత్మకమైన నిర్ణయం తీసుకుందని చెప్పారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. దళిత వాడల్లో శ్మశాన వాటికల ఏర్పాటుకు ఇది వరకు గుర్తించిన భూమికి హద్దులు నిర్ణయించి ఈ ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలని చెప్పారు. రీ సర్వే ప్రక్రియ వేగవంతం చేసేందుకు అదనపు సిబ్బంది నియామకం చేపట్టాలని పేర్కొన్నారు. స్పందన కార్యక్రమంలో అందిన అర్జీల పరిష్కారంపై శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ సమీక్షలో ఎంపీ రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆర్థిక పరిపుష్టికి వివిధ పథకాలకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేసేలా కృషి చేస్తున్నదని కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం కలెక్టర్, ఎల్‌డీఎం, వ్యవసాయ అనుబంధ శాఖలు, డీఆర్డీఏ, మెప్మా డీసీసీబీ, సంబంధిత శాఖల అధికారులతో కలసి వివిధ శాఖల ద్వారా అమలుతున్న పథకాల అమలు తీరు, అందుకు బ్యాంకుల సహకారం తదితర అంశాలపై చర్చించారు.

బోయకొండ వద్ద పర్యాటక కేంద్రం

టూరిజం అధికారులతో బుధవారం సాయంత్రం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం నాలుగు టూరిజం కేంద్రాలు ఉన్నాయని పులిగుండులో మాత్రం ప్రస్తుతం రిసార్ట్ నడుస్తోందని మిగతా ప్రాంతాల్లో మెయింటెనెన్స్‌లో ఉన్నాయని తెలిపారు. బోయకొండ వద్ద టూరిజం కేంద్రం ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. చిత్తూరు సమీపంలోని తిమ్మసముద్రం, నగిరిలో ప్రతిపాదనలు తయారు చేసినట్లు తెలిపారు.

సర్పంచ్‌కు సన్మానం



చిత్తూరు అగ్రికల్చర్ (పెనుమూరు): ఉత్తమ పంచాయతీగా ఎంపికైన చిన్నకలికిరి సర్పంచ్ తంగవేలును బుధవారం పెనుమూరులో నిర్వహించిన చేనేత సదస్సులో ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి దుశ్శాలువా కప్పి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధి పనులను గుర్తించి ప్రభుత్వం ఉత్తమ పంచాయతీగా ఎంపిక చేసిందన్నారు.

ప్రజారోగ్యానికి ఫ్యామిలీ డాక్టర్ భరోసా



పూతలపట్టు: గర్భిణులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రకాశం

పూతలపట్టు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రకాశం అన్నారు. మండలంలోని ఎగువపాలకూరులో బుధవారం వైద్యశాఖ సిబ్బంది నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. గర్భిణులతో మాట్లాడుతూ రక్తహీనత రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం తల్లీబిడ్డలకు శ్రేయస్కరం అన్నారు. అనంతరం పూతలపట్టులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, రోగుల వార్డులను, పరిసరాలను పరిశీలించారు. వైద్యాధికారులతో మాట్లాడుతూ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను మెరుగు పరచాలని సూచించారు. పీహెచ్‌సీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక, హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మోటకాంపల్లెలో..

ఐరాల: మండలంలోని మోటకాంపల్లెలో బుధవారం కాణిపాకం పీహెచ్‌సీ వైద్యాధికారి చందన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో వైద్యాధికారి 55 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ శివయ్య, ఎంఎల్‌హెచ్‌పీ దివ్య, ఏఎన్‌ఎం మాధవి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

తవణంపల్లె: మండలంలోని దిగువ తడకరలో 104 మొబైల్ వ్యాను ద్వారా వైద్యాధికారి ప్రియాంక ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు పరీక్షలు నిర్వహించారు. చిన్న పిల్లలకు వైద్య పరీక్షలు చేయించి సూచనలు, సలహాలు ఇచ్చారు. బీపీ, షుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ హరి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్‌ఎం శ్రీదేవి, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశావర్కర్ పాల్గొన్నారు.

వరసిద్ధునికి రూ.2 లక్షల విరాళం



విరాళం అందిస్తున్న ప్రొద్దుటూరుకు చెందిన వెంకటస్వామి



విరాళం అందిస్తున్న అనంతపురం జిల్లాకు చెందిన పరిటాల మహేంద్ర కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి నిత్యఅన్నదానానికి రూ.2లక్షల విరాళం అందింది. వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన వెంకటస్వామి, అనంతపురం జిల్లా వెంకటాపురానికి చెందిన పరిటాల మహేంద్ర బుధవారం వేర్వేరుగా కాణిపాకం విచ్చేసి స్వామివారి నిత్యాన్నదానానికి చెరో రూ.లక్ష విరాళం ఆయ అధికారులకు అందించారు. దాతలకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థప్రసాదాలు, చిత్రపటం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన



బంగారుపాళెం : లబ్ధిదారులకు పథకాలను వివరిస్తున్న పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

బంగారుపాళెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగిస్తున్నారని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని జిల్లేడుపల్లె పంచాయతీలోని జిల్లేడుపల్లె, దళితవాడ, కొత్తూరు గ్రామాల్లో ఎమ్మెల్యే నాయకులతో కలసి ఇంటింటికీ వెళ్లారు. సంక్షేమ పథకాల అమలు తీరు, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు తెలిపిన సమస్యలను అధికారులతో నమోదు చేయించి వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, పక్కా ఇళ్ల నిర్మాణాలు, రేషన్ కార్డుల జారీ, పింఛన్ల నమోదు, ఇళ్లపట్టాలు, స్థలాలు, సీసీ రోడ్ల నిర్మాణం, తాగునీటి వసతి ఏర్పాటు వంటి అంశాలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని చెప్పారు. సంక్షేమ పథకాల అమలులో అలసత్వం వహించినా, ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం చేసినా సహించేది లేదని హెచ్చరించారు. ఉద్యోగులు, వలంటీర్లు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో వ్యవహరించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా, జెడ్పీటీసీ సోమశేఖర్, సర్పంచ్ భారతమ్మ, ఎంపీటీసీలు శంకర్‌రెడ్డి, ఇందుశేఖర్‌రెడ్డి, హేమచంద్ర, సింగిల్ విండో, ఏఎంసీ చైర్మన్లు దత్తాత్రేయరెడ్డి, నారే సోమశేఖర్, జిల్లా పార్టీ కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి, దొరస్వామి, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు సాయిరెడ్డి, ఎస్‌బీసీ జిల్లా అధ్యక్షుడు ప్రసన్నకుమార్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు భానుప్రకాష్‌రెడ్డి, తహసీల్దార్ బెన్నురాజ్, ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కూర్మాయిపల్లెలో...

మండలంలోని కూర్మాయిపల్లె పంచాయతీలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ హరిప్రసాద్ తెలిపారు. ఉదయం 6.30 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించనున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

ఆలయాభివృద్ధికి సహకరించాలి



ఆలయ అభివృద్ధిపై మాస్టర్ ప్లాన్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు కోరారు. ఆలయ సమావేశపు మందిరంలో బుధవారం సాయంత్రం ఆలయ అధికారులకు, అర్చక వేదపండితులకు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆలయం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌ను అమలు చేయనున్నట్లు తెలిపారు. ఆలయంలో విధులు నిర్వర్తించే సిబ్బంది పలు అవినీతి ఆరోపణలతో ఆలయ ప్రతిష్ఠ దెబ్బతీస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఈ వెంకటనారాయణ, ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్లు, ఆలయ అధికారులు, అర్చక వేదపండితులు పాల్గొన్నారు.

జెర్సీతోనే అధిక దిగుబడి



ఉత్తమ రైతులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి

గుడిపాల: జెర్సీ ఆవులతో పాల దిగుబడి, ధర అధికంగా వస్తుందని ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, పశువైద్యాధికారులు సాయిసుధ, రవితేజ అన్నారు. మండలంలోని పెరుమాళ్లకుప్పంలో బుధవారం సంకరజాతి పేయదూడల ప్రదర్శన నిర్వహించారు. వైద్యాధికారులు మాట్లాడుతూ పేయదూడల్లో జెర్సీ జాతి ఆవుల వల్ల పాల దిగుబడి అధికంగా వస్తుందన్నారు. పాల ధర కూడా ఎక్కువగా వస్తుందని చెప్పారు. వర్షాకాలం, వేసవికాలానికి తట్టుకొనే శక్తి జెర్సీ ఆవులకు ఉంటుందని వివరించారు. అనంతరం పేయదూడల ప్రదర్శనలో ఆరోగ్యకరంగా ఉన్న మూడు దూడలకు సంబంధించి ముగ్గురు పాడి రైతులకు పాల క్యాన్‌లను బహుమతిగా అందజేశారు. అనంతరం ప్రదర్శనకు 50 దూడలు వచ్చాయి. కార్యక్రమంలో పశువైద్యులు శివరాజన్, దినేష్, వాసు, సిబ్బంది మాధవరెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.